# సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 15 । ఆగస్టు । 2024




**టన్ను చీనీ రూ.18 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 423 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



**పంచాయతీలకు నిధులు**

హర్ ఘర్ తిరంగాతో పాటు జాతీయ సమైక్యతా పోటీల నిర్వహణకు మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు మంజూరు చేశారు.

గరిష్టం/కనిష్టం
37.9°/ 22.8°

జిల్లాలో బుధవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలి వేగం తగ్గడంతో ఉక్కపోత కూడా పెరిగింది. ఆకాశం మేఘావృతమై చాలా మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

## న్యూస్‌రీల్

### వైద్య సేవలు మెరుగుపడాలి

- సబ్ కలెక్టర్ అపూర్వ భరత్



ఎమర్జెన్సీ వార్డులో వైద్యులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

హిందూపురం టౌన్: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడాలని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ సూచించారు. బుధవారం ఆయన డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్‌తో కలిసి స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు వార్డులు, ఆస్పత్రి పరిసరాలు, ఆక్సిజన్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో పారిశుధ్యం అన్ని విధాలా మెరుగుపడాలన్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారంలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రిలో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో సేవలపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్‌ను విచారించారు. అలాగే ఆస్పత్రిలో అందుతున్న సేవలు, ఎదుర్కొంటున్న సమస్యల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఇక నుంచి తాను ప్రతి వారం ఆస్పత్రిని సందర్శిస్తానని, ప్రస్తుతం తాను సూచించిన ప్రతి అంశాన్ని వారంలోపు మెరుగుపరచాలన్నారు.

### సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా



ధర్మవరం రూరల్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ధర్మవరం అర్బన్: జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్పీ రత్న తెలిపారు. బుధవారం రాత్రి ఆమె.. పట్టణంలోని టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బంది కొరత, సమస్యలపై డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ అశోక్‌కుమార్‌తో ఆరా తీశారు. ఆయా స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు, సమస్యాత్మక గ్రామాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఘర్షణ వాతావరణం తలెత్తకుండా ప్రతి కానిస్టేబుల్‌కు కొన్ని సమస్యాత్మక గ్రామాలను అప్పగించి ఆయా గ్రామాల్లోని పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటామన్నారు. వివిధ కేసుల్లో జైళ్లకు వెళ్లి నుంచి రిలీజ్ అయిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

**డీఓ ఎక్కడ పడితే అక్కడే విధులు..**

జిల్లాలో పోలీసు సిబ్బంది కొరత అధిగమించే క్రమంలో మ్యాన్ పవర్ ఆడిట్ ప్రారంభించామన్నారు. దీర్ఘకాలికంగా ఒకేచోట ఉన్న పోలీసులు, ఒక స్టేషన్ నుంచి మరొక స్టేషన్‌కు డీఓలో పనిచేస్తున్న పోలీసులను మార్చు చేయనున్నట్లు వెల్లడించారు. కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు రెండు టీంలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

### పలువురు సీఐల బదిలీ

అనంతపురం సెంట్రల్: అనంతపురం రేంజ్‌లో పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ షిమోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడిపత్రి అర్బన్ సీఐగా ఉన్న నాగేంద్ర ప్రసాద్‌ను ధర్మవరం వన్‌టౌన్‌కు, ఓర్వకల్ ఎయిర్‌పోర్టు సీఐగా ఉన్న సాయి ప్రసాద్‌ను తాడిపత్రి అర్బన్ స్టేషన్‌కు, అనంతపురం వన్‌టౌన్‌లో ఉన్న రెడ్డప్పను ధర్మవరం టూటౌన్‌కు, అనంతపురం ఏసీబీ సీఐగా ఉన్న ప్రభాకర్‌ను ధర్మవరం రూరల్ స్టేషన్‌కు, కడప ఎస్పీ వద్ద వీఆర్‌లో ఉన్న అబ్దుల్ ఖరీంను హిందూపురం టూటౌన్‌కు, అన్నమయ్య జిల్లా దిశ సీఐగా ఉన్న నాగేంద్రను కదిరి రూరల్ స్టేషన్‌కు, కడప తాలూకా స్టేషన్‌లో ఉన్న కొలుట్లయ్యను శింగనమలకు, మడకశిరలో ఉన్న మనోహర్‌ను గుంతకల్లు వన్‌టౌన్‌కు, అనంతపురం ఏసీబీ సీఐగా ఉన్న శివ గంగాధర్‌రెడ్డిని తాడిపత్రి రూరల్ స్టేషన్‌కు, పుట్టపర్తి ఎస్పీ వద్ద వీఆర్‌లో ఉన్న ఈరన్నను యాడికి స్టేషన్‌కు, అనంతపురం ఎస్పీ వద్ద వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వర్లును గుత్తికి, ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐగా ఉన్న కె.వెంకటరమణను రాయదుర్గం రూరల్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ధర్మవరం టూటౌన్ సీఐ అశోక్‌కుమార్‌ను, ధర్మవరం రూరల్ సీఐ అరోహణరావును వీఆర్ (శ్రీసత్యసాయి)కు పంపారు. అలాగే గుంతకల్లు సీఐ రామసుబ్బయ్యను, తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డిని, యాడికి సీఐ నాగార్జునరెడ్డిని వీఆర్ (అనంతపురం)కు పంపారు.



విద్యుత్ దీపాల వెలుగులో కాంతులీనుతున్న కలెక్టరేట్

## జెండా పండుగకు సర్వం సిద్ధం



పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న, జేసీ అభిషేక్ కుమార్ తదితరులు

పుట్టపర్తి అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవానికి సర్వం సిద్ధమైంది. పుట్టపర్తి సమీపంలోని శిరసాని హిల్స్ పోలీస్ పరేడ్ గ్రౌండు వేదికగా జరిగే 78వ స్వాతంత్య్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొననున్నారు. ఇప్పటికే పరేడ్ గ్రౌండ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 9.05 గంటలకు మంత్రి సవిత జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం, స్వాతంత్య్ర దినోత్సవ సందేశం, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. అలాగే ఉత్తమ సేవలందించిన 472 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాల ప్రదానం ఉంటుందని కలెక్టర్ చేతన్ తెలిపారు. ఇక బుధవారం సాయంత్రం కలెక్టర్, ఎస్పీ తదితరులు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులకు తగిన సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది రిహార్సల్స్‌ను ఎస్పీ రత్న, అడిషనల్ ఎస్పీ పరిశీలించారు.



పరేడ్ సాధన చేస్తున్న ఏఆర్ పోలీసులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు సుజాత. హిందూపురంలో నివాసం ఉంటోంది. తన కుమారుడు చరణ్ కుమార్‌కు జ్వరం వస్తే ఈ నెల 12వ తేదీన హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చింది. ఓపీ కోసం క్యూలో 20 నిమిషాలు వేచి చూస్తే ఓపీ స్లిప్ అందింది. అక్కడి నుంచి వైద్యుడి వద్దకు వెళ్లి సేవలు పొందడానికి గంటకుపైగా సమయం పట్టింది. ఆ తర్వాత మందులు పొందేందుకు మరో అరగంట.. దీంతో చిన్నారి నీరసపడిపోయాడు. ఓపీకి, మందులు ఇచ్చేందుకు అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతోంది.



హిందూపురం జిల్లా ఆస్పత్రిలో మందుల కోసం క్యూ కట్టిన రోగులు

# నిరీక్షిస్తేనే వైద్యం!

| | |
|---|---|
| 200 | హిందూపురం జిల్లా ఆస్పత్రిలో పడకల సంఖ్య |
| 1,000 | రోజు అవుట్ పేషెంట్ల సంఖ్య |
| 150 | ఆస్పత్రిలో ఉండే ఇన్‌పేషెంట్ల సంఖ్య |

| | |
|---|---|
| ఆస్పత్రిలో ఉండాల్సిన డాక్టర్లు | 42 |
| ప్రస్తుతం ఉన్న డాక్టర్లు | 34 |
| ఉండాల్సిన పారామెడికల్ స్టాఫ్ | 31 |
| ప్రస్తుతం ఉన్న పారామెడికల్ స్టాఫ్ | 28 |
| ఉండాల్సిన నర్సింగ్ స్టాఫ్ | 47 |
| ప్రస్తుతం ఉన్న నర్సింగ్ స్టాఫ్ | 46 |
| ఉండాల్సిన టెక్నికల్ స్టాఫ్ | 15 |
| ప్రస్తుతం ఉన్న టెక్నికల్ స్టాఫ్ | 11 |



పోస్ట్ ఆపరేటివ్ వార్డులో పని చేయని ఏసీ

హిందూపురం జిల్లా ఆస్పత్రి... జిల్లాకే పెద్దదిక్కు. పేదలకు ఏ అనారోగ్య సమస్య తలెత్తినా పరుగున వచ్చేది ఇక్కడికే. కానీ ఇక్కడి వైద్యులు నాడి పట్టడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత అసలు వైద్యులే కనిపించడం లేదు. అత్యవసరమైతే నర్సులే వైద్యుల అవతారమెత్తి వైద్యం చేస్తున్నారు. సేవలపై ఎవరైనా ప్రశ్నిస్తే 'ప్రైవేటు'కు వెళ్లదంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. సర్కారు జీతం తీసుకుంటున్న వైద్యులు మాత్రం 'ప్రైవేటు' సేవలో తరిస్తున్నారు.

- హిందూపురం జిల్లా ఆస్పత్రిలో రోగుల అవస్థలు
- వైద్యులున్నా.. వైద్య సేవలు సున్నా
- ఇంటి వద్ద క్లినిక్‌లకే డాక్టర్లు పరిమితం
- ప్రభుత్వాస్పత్రి నుంచే క్లినిక్‌లకు రెఫర్
- ఎప్పుడు వెళ్లినా 'ఇప్పుడే వెళ్లారు' అంటూ సిబ్బంది సమాధానం
- ఓపీ నమోదయ్యాక గంట నిరీక్షిస్తేనే వైద్య సేవలు
- మందులు తీసుకోవాలంటే మరో గంట తప్పని నిరీక్షణ

సాక్షి, పుట్టపర్తి

ఆస్పత్రి నిండా వైద్యులు...కావాల్సినన్ని పరికరాలు.. అయినా వైద్య సేవలు మాత్రం అందవు. 'పేరుకే పెద్దాస్పత్రి' సేవల్లో మాత్రం పీహెచ్‌సీలా తయారైంది హిందూపురం జిల్లా ఆస్పత్రి. హాజరు పట్టికలో అందరి సంతకాలు కనిపించినా... వైద్యులు మాత్రం కనిపించరు. ఇక్కడికి రోజుకు సగటున వెయ్యి మంది రోగులు వస్తుంటారు. చుట్టుపక్కల సుమారు పది మండలాలకు ఈ ఆస్పత్రే దిక్కు. డాక్టర్లు, సిబ్బంది, వైద్య పరికరాల కొరత లేదు. కానీ నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదు. ఓపీ కోసం గంట నిరీక్షిస్తే వైద్యుడి దర్శనం కలుగుతుందని, ఆయన పరీక్షించి మందులు రాశాక..మరో గంట క్యూలో నిల్చుంటేనే మందులు దొరుకుతాయని రోగులు వాపోతున్నారు.



సిబ్బంది పట్టించుకోకపోవడంతో రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న బంధువులు



టోకెన్ తీసుకుని వైద్యుడి గది ముందు వేచి ఉన్న మహిళలు

**పీడియాట్రిక్ వార్డు కిటకిట..**

200 పడకల జిల్లా ఆస్పత్రిలో గైనిక్ వార్డులో 50 పడకలు, పీడియాట్రిక్ వార్డులో 50 పడకలు ఉంటాయి. కానీ పీడియాట్రిక్ ఐపీ మాత్రం నిత్యం 80 నుంచి 100 వరకూ ఉంటోంది. దీంతో ఒకే మంచంపై ఇద్దరిని ఉంచాల్సిన పరిస్థితి. దీనికి తోడు వైద్యులు సకాలంలో వార్డుల్లోకి రాకపోవడంతో చిన్నారులకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదు. ఇక కాన్పుల వార్డులోనూ నిరీక్షిస్తేనే వైద్యం అన్నట్లుగా ఉంది. ఆస్పత్రిలో అన్ని రకాల సదుపాయాలున్నా... వైద్యం చేసేవారు కరువయ్యారని రోగులు, వారి బంధువులు వాపోతున్నారు. మధ్యాహ్నం వరకు అరకొరగా వైద్యం చేస్తున్నారని.. ఆ తర్వాత ఎమర్జెన్సీ కేసులు తప్ప.. అడ్మిట్ అయిన వారికి నర్సులే వైద్యం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

**గంట వేచి చూస్తేనే ఓపీ..**

హిందూపురం జిల్లా ఆస్పత్రికి చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజుకు సగటున వెయ్యి మంది వరకు రోగులు వస్తుంటారు. ఐపీ 150 వరకూ ఉంటోంది. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి. ఓపీ నమోదు చేయించుకుని.. డాక్టర్ వద్ద వైద్య సేవలు పొందాలంటే కనీసం గంట సేపు వేచి చూడాల్సి వస్తోంది. డాక్టర్లు ఆలస్యంగా వస్తున్న కారణంగా ఆయా వార్డుల వద్ద రోగులు క్యూ లో ఉండాల్సిన దుస్థితి. ఆ తర్వాత మందులు పంపిణీ చేసే కౌంటర్ ఒక్కటే ఉండటంతో...అక్కడా దాదాపు గంట సేపు క్యూలో నిలబడాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. అందులోనూ ఆరు రకాల మందులు రాస్తే.. మూడు నాలుగు రకాలు మాత్రమే ఇస్తారని.. మరో రెండు రకాలు బయట కొనాల్సి వస్తోందని రొద్దం మండలానికి ఓ రోగి బంధువు వాపోయాడు.

**'ప్రైవేటు'కు వెళ్లండి..**

మధ్యాహ్నం తర్వాత జిల్లా ఆస్పత్రికి వెళ్తే వైద్య సేవలు అందని పరిస్థితి. ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే నర్సులే వైద్యం చేస్తున్నారు. డాక్టర్ ఎక్కడని ప్రశ్నిస్తే.. ఇప్పుడే వెళ్లారని సమాధానం చెబుతారు. అంతేకాకుండా.. మెరుగైన వైద్యం కావాలంటే పక్కనే ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత ఎప్పుడు ఆస్పత్రికి వచ్చినా ఇదే సమాధానం వినిపిస్తుందని రోగుల బంధువులు వాపోతున్నారు.

**రోగులకు తప్పని అవస్థలు..**

వైద్యులు సమయపాలన పాటించకపోవడం.. విధుల్లో ఉన్నప్పటికీ సీట్లలో ఉండకపోవడంతో జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు సకాలంలో అందడం లేదు. చిన్న పిల్లల వార్డు, గర్భిణుల వార్డు, మహిళల వార్డు, డయాలసిస్ కేంద్రం, నవజాత శిశువుల కేంద్రం, కార్డియాక్ కేర్ సెంటర్, ల్యాబ్, ఈసీజీ, ఓపీ విభాగం, మందుల పంపిణీ కేంద్రం.. ఇలా అన్ని చోట్ల రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఏ ఒక్క వార్డులోనూ సకాలంలో సేవలు అందడం లేదని రోగులు వాపోతున్నారు.

**వైద్యులు ఫుల్.. సేవలు డల్..**

హిందూపురం జిల్లా ఆస్పత్రికి ఎంత మంది వైద్యులు అవసరమో గత వైఎస్ జగన్ సర్కార్ అంతమందిని నియమించింది. అయితే గత రెండు నెలలుగా పర్యవేక్షణ కొరవడటంతో వైద్య సేవలు అందించడంలో వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. ఆస్పత్రికి కూతవేటు దూరంలోనే పదుల సంఖ్యలో ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. అన్ని ఆస్పత్రుల్లోనూ ప్రభుత్వ డాక్టర్లే పని చేస్తున్నారు. దీంతో ఎప్పుడెప్పుడు ప్రైవేటు ఆస్పత్రికి పరిగెడుదామనే ఆలోచనలో... జిల్లా ఆస్పత్రిలో సేవలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఉదయం ఆలస్యంగా రావడం.. సాయంత్రం తొందరగా వెళ్లడం ఇక్కడ మామూలుగా సాగుతోంది.


**విభాగాలు:** టీబీ, డయాలసిస్, కార్డియాలజీ కేర్ యూనిట్, పీడియాట్రిక్, గైనిక్, జనరల్ వార్డులు, ఎమర్జెన్సీ, ఎండోస్కోపి, బ్లడ్ బ్యాంక్, ల్యాబ్, ఈసీజీ, ఎక్స్‌రే, డీఈఐసీ (డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్), ఫార్మసీ, ఆక్సిజన్ ప్లాంట్, స్టెమీ వార్డు, ఆరోగ్యశ్రీ

**కావాల్సిన పరికరాలు :** ఐసీయూ, సీటీ స్కాన్.

### పగటి పూట మాత్రమే సేవలు

నేను అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాను. రోజు పగటి పూట మాత్రమే వైద్యులు రౌండ్స్‌కు వస్తున్నారు. సాయంత్రం వేళ ఎవరూ రావడం లేదు. ఏదైనా అవసరం ఉంటే ఉన్న నర్సులే సేవలందిస్తున్నారు. ఉదయం డాక్టర్ సూచించిన విధంగానే మందులు, వైద్య సేవలు అందిస్తున్నారు. – కృష్ణ, హిందూపురం

### కాల్ ఆన్ డ్యూటీలో రావాల్సిందే



చాలా మంది వైద్యులు పని వేళలు ముగిశాక.. ప్రైవేటు ఆస్పత్రుల్లో పని చేస్తున్న మాట వాస్తవమే. అయితే ఆస్పత్రి నుంచి కాల్ చేసి.. రోగులు ఉన్నారంటే.. వైద్యం చేసేందుకు పది నిమిషాల్లో చేరుకోవాల్సిందే. ఎవరూ కూడా నిర్లక్ష్యం చేయరాదు. కాల్ ఆన్ డ్యూటీ ప్రకారం నడుచుకోవాల్సిందే. అలా రాని వారిపై చర్యలకు సిఫారసు చేస్తాం.

– రోహిల్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్



ఆస్పత్రి ఆవరణలో వేచి చూస్తున్న రోగులు



బాలింతలతో కిటకిటలాడుతున్న గైనిక్ వార్డు



వైద్యుల కోసం వేచి చూస్తున్న బాలింతలు

## క్లుప్తంగా

### కర్ణాటక మద్యం అక్రమ రవాణాను అరికట్టండి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



సెబ్ అధికారులకు సూచనలు ఇస్తున్న విజయశేఖర్

మడకశిర: కర్ణాటక నుంచి జిల్లాలోకి మద్యం అక్రమ రవాణా జరగకుండా నిఘా మరింత పటిష్టం చేయాలని సెబ్ అధికారులకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ సూచించారు. బుధవారం ఆయన మడకశిర ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఏ గ్రామాలోనూ కర్ణాటక మద్యం కనిపించరాదన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి విక్రయాలు సైతం అరికట్టాలని ఆదేశించారు. సమావేశంలో సెబ్ సీఐ ధీరజ్‌రెడ్డి, ఎస్‌ఐ మస్తాన్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

### కర్ణాటక మద్యం పట్టివేత


లేపాక్షి: కర్ణాటక నుంచి అక్రమంగా జిల్లాలోకి తరలించుకు వస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన లేపాక్షి ఎస్‌ఐ గోపి, సిబ్బంది బుధవారం తెల్లవారుజామున స్థానిక చలపతి షెడ్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కల్లూరు గ్రామానికి చెందిన నలుగురు కర్ణాటకలోని నగరిగెర నుంచి మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడ్డారు. వీరి నుంచి 1392 హైవార్డ్స్, 90 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తి.. మడకశిర దీప్తి

**సందర్భం: నేడు స్వాతంత్ర్య దినోత్సవం**

- మహాత్ముడి పిలుపుతో ఉద్యమ బాట పట్టిన మడకశిర యోధులు

మడకశిర: స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను పరిశీలిస్తే మడకశిర వాసులు చెరగని ముద్ర వేసిన ఘటనలు ఎన్నో కనిపిస్తాయి. మహనీయులు పిలుపునందుకుని పలువురు ఉజ్వల జ్యోతులై వెలుగులీనారు. వీరిలో ఎస్.శ్రీరామిరెడ్డి, గొల్లపల్లి రామశాస్త్రి, మెళవాయి అశ్వత్థరామిరెడ్డి, అనంతరాజు, హరేసముద్రం నరసింగారావు, రాళ్లపల్లి కరణం నాగేశ్వరరావు, సీఏ ఆనందక్రిష్ణయ్య, గుడ్డదహళ్లి శివన్న, పాపసానిపల్లి రామిరెడ్డి, హల్కూరు నారాయణరావు, మైనగానిపల్లి గంగప్ప, శంకరగల్లు పెద్దబాబు సాహెబ్, బసవనపల్లి రంగారెడ్డి, మడకశిర రజాక్‌సాహెబ్, అగళి లక్ష్మీనారాయణయ్య తదితరులు ముఖ్యులు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మడకశిర ప్రాంత సమరయోధుల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం.



మడకశిర కొండ

### జైలు జీవితమే ఎక్కువ



మడకశిర మండలం హరేసముద్రంలో 1909, మార్చి 10న జన్మించిన నరసింగారావు.. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆయన బయటి జీవితం కంటే జైలు జీవితమే ఎక్కువగా ఉంది. గ్రామ స్థాయిలో క్విట్ ఇండియా ఉద్యమాన్ని బలంగా నడిపించారు.

### దీనజనోద్ధరణలోనే ఆనందం



1918లో మడకశిరలో జన్మించిన సీఏ ఆనంద క్రిష్ణయ్య... వ్యక్తిగత సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొని బ్రిటీష్ పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఈ క్రమంలో పలు మార్లు ఆయన జైలు జీవితం గడపాల్సి వచ్చింది. దీనజనోద్ధరణకు మారు పేరుగా నిలిచిన ఆయన... దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత భారత ప్రభుత్వం 15 ఎకరాల భూమిని ఇనామ్‌గా ఇచ్చేందుకు ప్రయత్నిస్తే... ఆ భూమిని పేదలకు ఇవ్వాలని సూచించారు.

### ఉద్యమమే ఊపిరిగా..



ఎస్.శ్రీరామిరెడ్డి.... మడకశిర మండలం నీలకంఠాపురంలో 1906, అక్టోబర్ 6న జన్మించిన ఆయన... ప్రస్తుత ఏఐసీసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డికి పెద్ద నాన్న అవుతారు. మహాత్ముడి పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమమే ఊపిరిగా పోరుబాట పట్టారు. యువతను చైతన్య పరుస్తూ ఉద్యమ స్ఫూర్తి రగిలించిన ఆయన పలు మార్లు బ్రిటీష్ సైన్యానికి పట్టుబడి జైలు శిక్ష అనుభవించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం రాజకీయాల్లో రాణించారు. రెండు సార్లు కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

### వ్యక్తి సత్యాగ్రహి.. గొల్లపల్లి



మడకశిర మండలం గొల్లపల్లికి చెందిన రామాశాస్త్రి 1910, అక్టోబర్ 6న జన్మించారు. మహాత్ముడి పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమ బాట పట్టిన ఆయన క్విట్ ఇండియా ఉద్యమాన్ని బలంగా నడిపించారు. 1941లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్లారు. ఆయనను స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తిస్తూ భారత ప్రభుత్వం 15 ఎకరాల భూమిని అందజేసింది.

### మహాత్ముడి స్ఫూర్తితో...



మడకశిర మండలం ఆమిదాలగొంది గ్రామానికి చెందిన అనంతరాజు... మహాత్ముడి అహింసాత్మక పోరాట స్ఫూర్తితో 1930లో స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టారు. 1941లో సత్యగ్రహ ఉద్యమాన్ని నడిపించారు. ఆయను స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తిస్తూ 15 ఎకరాల భూమిని అప్పట్లో భారత ప్రభుత్వం ఉచితంగా అందించింది.

### ఆదర్శ ప్రాయం



గుడిబండ మండలం రాళ్లపల్లిలో 1908, నవంబర్ 18న జన్మించిన కరణం నాగేశ్వరరావు... స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తిదాయక పోరాటాలు సాగించారు. గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తూ యువతను చైతన్యపరిచి స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములను చేస్తూ వచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని బలంగా నడిపించారు. ఈ క్రమంలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సమరయోధుల త్యాగాలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం ఇనామ్‌గా ఇచ్చిన భూమిని ఆయన తిరస్కరించి, ఆదర్శంగా నిలిచారు.

## వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ కార్యకర్తల దాడి

కనగానపల్లి: మండలంలోని బద్దలాపురం గ్రామంలో మంగళవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నేత కురుబ ముత్యాలప్పపై స్థానిక టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. రాత్రి 9 గంటల సమయంలో గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద కూర్చొన్న ముత్యాలప్పతో కొందరు టీడీపీ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. కేకలు వేస్తూ రెచ్చగొట్టి తీవ్రంగా కొట్టారు. అదే సమయంలో గ్రామస్తులు కల్పించుకుని అడ్డుకోవడంతో టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు మాట్లాడుతూ... టీడీపీ కార్యకర్తలు తప్పతాగి ఇళ్ల వద్దకు వచ్చి గొడవ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం రామగిరి సీఐ శివాంజనేయులు ఆదేశాలతో గ్రామంలోని టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ ఎదుట వారిని బైండోవర్ చేయించారు.

## కూటమి నాయకుల ఘర్షణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: అమడగూరు మండలం మహమ్మదాబాద్‌లో టీడీపీ, జనసేన నాయకులు బుధవారం పరస్పర దాడులతో భయానక వాతావరణం సృష్టించారు. వివరాలు... జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉంటున్న పసుపులేటి రమేష్‌బాబు బుధవారం తన స్వగృహంలో ఉన్న సమయంలో కందుకూరిపల్లికి చెందిన చాకలి వెంకటేష్‌తో పాటు మరికొందరు టీడీపీ నాయకులు గొడవకు దిగారు. మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, కందుకూరిపల్లికి చెందిన కృష్ణమూర్తిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు చేస్తున్నావంటూ దాడికి తెగబడ్డారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ కార్యకర్తలూ అక్కడకు చేరుకోవడంతో గొడవ పెద్దదైంది. ఇరు పార్టీలకు చెందిన వారు కర్రలు తీసుకుని కొట్టుకున్నారు. అనంతరం ఇరువర్గాల వారు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పరస్పరం ఫిర్యాదు చేశారు. చాకలి వెంకటేష్ ఫిర్యాదు మేరకు పసుపులేటి రమేష్‌బాబు, ఆయన సోదరుడు చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేశారు. అలాగే డయల్ 100కు రమేష్‌బాబు చేసిన కాల్ ఆధారంగా కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. దాడిలో గాయపడిన రమేష్‌బాబును చికిత్స నిమిత్తం కదిరి ఆస్పత్రికి తరలించారు.




### మడకశిర విద్యుత్ సబ్ డివిజన్‌కు పురస్కారం



డీఈ సుబ్రహ్మణ్యప్రసాద్

మడకశిర: మడకశిర విద్యుత్ సబ్ డివిజన్‌కు ఉత్తమ పురస్కారం లభించింది. ప్రధానంగా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు లోను కాకుండా సకాలంలో నిర్వహణ చేయడంతో పాటు విద్యుత్ సరఫరాలో నాణ్యతను పెంచిన నేపథ్యంలో ఈ పురస్కారం దక్కినట్లు డీఈ సుబ్రహ్మణ్య ప్రసాద్ తెలిపారు. గురువారం తిరుపతిలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు.

### ప్రమాదంలో వ్యక్తి మృతి

పావగడ: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం పెద్దగువ్వలపల్లికి చెందిన రామాంజనేయులు (56) తన కుమారుడు కోటేశ్వర్లు తో కలసి బుధవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై పావగడకు బయలుదేరారు. పావగడ తాలూకా పరిధిలోని కొడమడుగు గ్రామ సమీపంలో ధాబా వద్దకు చేరుకోగానే ఎదురుగా కొడమడుగు గ్రామానికి చెందిన మద్దిలేటప్ప ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొన్నాడు. ఘటనలో రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కోటేశ్వర్లు, మద్దిలేటప్పను స్థానికులు వెంటనే పావగడలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం బెంగళూరుకు రెఫర్ చేశారు. ఘటనపై సీఐ సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### 16 మండలాల్లో వాన

పుట్టపర్తి అర్బన్: మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లాలోని 16 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా అమరాపురం మండలంలో 61.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక రొళ్ల మండలంలో 48.4, గుడిబండ 37.6, సోమందేపల్లి 32.4, అగళి 14.4, రొద్దం 13.0, బుక్కపట్నం 12.2, మడకశిర 9.8, కనగానపల్లి, కొత్తచెరువు మండలంలో 9.2 మి.మీ చొప్పున, గోరంట్ల 8.2, పుట్టపర్తి 5.6, పెనుకొండ 3.8, పరిగి 3.4, బత్తలపల్లి 2.2, కదిరి 1.8 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూములు ఇవ్వండి : ఆర్డీఓ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి

ముదిగుబ్బ: సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు లీజు పద్ధతిపై భూములు ఇవ్వాలని రైతులను ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి కోరారు. ముదిగుబ్బ మండలం ఎస్ఎస్‌పీ కొట్టాలలో ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణకు బుధవారం రైతులకు అవగాహన, ప్రజాభిప్రాయ సేకరణ సభ ఏర్పాటు చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ... దొరిగిల్లు, సానేవారిపల్లి పొలాల్లో ప్లాంట్ ఏర్పాటుకు 6 వేల ఎకరాలు అవసరమవుతాయని గుర్తించామన్నారు. భూములు లీజుకు ఇచ్చిన ప్రతి రైతుకూ ఏడాదికి ఎకరానికి రూ.30వేల చొప్పున 30 ఏళ్ల పాటు చెల్లిస్తారన్నారు. ఈ క్రమంలో ప్రతి ఐదేళ్లకు ఓ సారి 5 శాతాన్ని పెంచుతారన్నారు. రైతులు ఇష్ట పూర్వకంగా భూములు లీజుకు ఇస్తే ఈ ప్రాంతంలోనే సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. లేకుంటే మరో ప్రాంతానికి మార్చేందుకు కంపెనీ ప్రతినిధులు ప్రయత్నాలు చేస్తారన్నారు. గ్రామ సభలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మునుస్వామి, సోలార్ కంపెనీ ప్రతినిధులు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

## కొడిగెనహళ్లి స్కూల్‌కు అవార్డు

- నేడు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అందుకోనున్న ప్రిన్సిపాల్



కొడిగెనహళ్లిలోని ఏపీఆర్ స్కూల్

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో ఉన్న ఏపీ ప్రతిభావంతుల ఆశ్రమ పాఠశాలకు బెస్ట్ స్కూల్ అవార్డు దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరావతిలో గురువారం జరిగే వేడుకల్లో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అవార్డు అందుకోనున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో సాధించిన పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఏపీఆర్ఎస్ పాఠశాలలకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. రాష్ట్ర స్థాయిలో మొదటి పది ర్యాంకుల్లో మూడు, ఏడు, పది స్థానాలను ఈ పాఠశాల విద్యార్థులు దక్కించుకున్నారు. గురుకులాల జనరల్ కేటగిరి విద్యాసంస్థలకు సంబంధించి మొత్తం 51 పాఠశాలల్లో కొడిగెనహళ్లి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడాన్ని దృష్టిలో ఉంచుకుని ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## 'ఏపీజీఎల్ఐ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి'



ఏపీజీఎల్ఐ డీడీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఏపీజీఎల్ఐ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏపీజీఎల్ఐసీ డీడీ భాస్కర్‌తేజను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్ మాట్లాడుతూ... ఏపీజీఎల్ఐ పాలసీదారులకు తుది చెల్లింపులు, రుణాల మంజూరు, చెల్లింపులు, డెత్ క్లెయిమ్స్ సమస్యలను వెంటనే పరిష్కరించని కారణంగా ఆర్థిక సాయం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తమ వార్షిక ఖాతా నిలువల్లో మిస్సింగ్ క్రెడిట్స్ లేకుండా తక్షణమే నవీకరించి విడుదల చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఏపీజీఎల్ఐ పాలసీ పరిణతి చెందిన పాలసీదారులకు తుది చెల్లింపులు వెంటనే చేయాలన్నారు. కార్యాలయ రికార్డుల ఆధారంగా మిస్సింగ్స్ క్రెడిట్స్ గుర్తించి నవీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్ వలి, వెంకటరమణ, నాయకులు వన్నప్ప, గోరంట్ల శ్రీనివాసులు, కలీముల్లా, తిప్పేస్వామి, శ్రీనివాసులు, హనుమంతు, నస్రుల్లా, రంగానాయుడు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ– బ్లెకింగ్ సాంకేతిక విశ్వవిద్యాలయం (స్వీడన్) సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సహకార కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ సీఎస్ఈ, ఈసీఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు జేఎన్‌టీయూ వెబ్‌సైట్లో లేదా కళాశాలలోని విదేశీ వ్యవహారాల డెరెక్టర్, అల్యూమినీ కార్యాలయంలో ఈ నెల 19 నుంచి 24లోగా సంప్రదించాలని కోరారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులు ఉండడంతో పాటు జేఈఈ మెయిన్స్–2024, ఈఏపీసెట్‌లో పొందిన ర్యాంకు ఆధారంగా ఎంపిక చేస్తారని వివరించారు.



### గవర్నర్ విందుకు ధర్మవరం డిజైనర్



ఆహ్వాన ప్రతిని చూపుతున్న డిజైనర్ నాగరాజు

ధర్మవరం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రముఖులకు గవర్నర్ ఏర్పాటు చేసే విందుకు ధర్మవరానికి చెందిన చేనేత డిజైనర్ నాగరాజుకు ఆహ్వానం అందింది. చేనేత డిజైనింగ్‌లో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటూ వచ్చిన నాగరాజు దేశ నాయకులు, ప్రముఖ రాజకీయ నేతల చిత్రాలను పట్టు వస్త్రంపై చేసి ప్రదర్శించారు. వివిధ దేవాలయాల్లో జరిగే ఉత్సవాలకు సైతం నాగరాజు డిజైన్ చేసిన పట్టువస్త్రాలనే వినియోగిస్తున్నారు. డిజైనింగ్‌లో ప్రత్యేకత చాటుతున్న నాగరాజు ప్రతిభను గుర్తించి గురువారం నిర్వహించే విందులో పాల్గొనాలంటూ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పంపిన ఆహ్వాన ప్రతిని బుధవారం ఆయనకు ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి అందించారు.

### అగ్రరాజ్య గగన తలంలో తిరంగా రెపరెపలు

- 20 వేల అడుగుల ఎత్తున ప్రదర్శించిన అనంత యువకుడు



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న అఖిల్

అనంతపురం కల్చరల్: అగ్రరాజ్యమైన అమెరికా గగన తలంపై మువ్వెన్నల జెండా రెపరెపలాడింది. అనంతపురం నగరానికి చెందిన రమణారెడ్డి కుమారుడు అఖిల్ గత 6 ఏళ్లుగా అమెరికాలోనే ఉంటున్నారు. అనేక సందర్భాల్లో అక్కడ తన దేశభక్తిని చాటుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 13న 20 వేల అడుగుల ఎత్తున స్కైడైవింగ్ చేస్తూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. దాదాపు గంటకు పైగా ఈ దృశ్యం ప్రవాస భారతీయులతో పాటు పలువురు అమెరికన్లకూ కనువిందు చేసింది. ఖండాంతరాలు దాటి వచ్చినా భరత జాతి ఇచ్చిన ప్రోత్సాహాన్ని మరచిపోలేమని, విభిన్నమైన సంస్కృతీసంప్రదాయాలకు నిలయమని భారతీయులందరికీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు అంటూ అమెరికా నుంచి అఖిల్ ట్వీట్ చేయడం గమనార్హం.

### వ్యక్తి బలవన్మరణం



మృతుడు శ్రీనివాసులు

హిందూపురం అర్బన్: అనారోగ్యాన్ని తాళలేక జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి అరవింద్ నగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులు (57)కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్న శ్రీనివాసులుకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆన బుధవారం గ్రామ శివారులోని పొలాల్లో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ హరూన్‌బాషా అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

### ఆటో డ్రైవర్ ఆత్మహత్య



మృతుడు హరి

ధర్మవరం రూరల్: మండలంలోని పోతుకుంట గ్రామానికి చెందిన హరి (39) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న హరికి భార్య లక్ష్మీదేవి, ఓ కుమార్తె ఉన్నారు. ఇటీవల ఆటో బాడుగలు సరిగా లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ క్రమంలో కుటుంబ అవసరాలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. అప్పులకు వడ్డీల భారం పెరుగుతూ వస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన హరి... బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### ప్రమాదంలో యువకుడి మృతి



నరేంద్ర (ఫైల్)

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన హరిజన నరేంద్ర (30) కియా అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద చెరువుకట్ట ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం జరిగిన సమీప బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యాడు. బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై గ్రామానికి తిరుగు ప్రయాణమైన నరేంద్ర... మార్గం మధ్యలో హరిపురం జంక్షన్ వద్దకు చేరుకోగానే రోడ్డు దాటుతున్న కురుబవాండ్లపల్లికి చెందిన వృద్ధురాలు మిద్దే పార్వతమ్మను ఢీకొన్నాడు. ఘటనలో గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా పెనుకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నరేంద్రకు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. చికిత్సకు స్పందించక అనంతపురంలోని జీజీహెచ్‌లో ఆయన మృతి చెందాడు. మృతుని తల్లి అంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కియా ఎస్‌ఐ నజీర్ అహమ్మద్ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
గురువారం ॥ 15-8-2024






● దుర్గావతి

విప్లవ వనిత

## మూడేళ్ల కొడుకును పణంగా పెట్టి...

# భగత్‌సింగ్‌ను కాపాడిన భాభీ

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌వీర్... వీరంతా ఆమెను 'దుర్గా భాభీ' అని పిలిచేవారు. సాయుధ పోరాటంతోనే బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టగలం అని భావించిన దళంలో పిస్తోల్ పట్టిన తొలి విప్లవ వనిత దుర్గావతి దేవి. బ్రిటిష్ అధికారి సాండర్స్‌ను హత్య చేసిన భగత్‌సింగ్‌ను లాహోర్ నుంచి తప్పించేందుకు అతడి భార్య అవతారం ఎత్తిందామె. చరిత్ర పుటలలో కనుమరుగై పోయిన ఆ త్యాగమయి గురించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

'సైమన్ గోబ్యాక్' నిరసన కార్యక్రమం చేస్తున్న లాలా లజపతిరాయ్ మీద బ్రిటిష్ పోలీసుల లాఠీచార్జీ జరిగి ఆయన ప్రాణం పోయింది. పంజాబ్‌లో యువతకు మార్గదర్శిగా ఉన్న ఆ మహా నాయకుణ్ణి కోల్పోయినందుకు 'హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' (హెచ్ఎస్ఆర్ఏ) సభ్యులకు ఆగ్రహం వచ్చింది. ఇది స్వాతంత్ర్య సమరయోధుడు భగవతి చరణ్ ఓహ్రా నడుపుతున్న గ్రూప్. చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ తదితరులంతా ఇందులో సభ్యులు. వీరంతా కలిసి లాఠీచార్జిని ఆర్డర్ వేసిన బ్రిటిష్ ఆఫీసర్ స్కాట్‌ను చంపాలనుకున్నారు. నిర్ణయం అమలు పరచడమే తరువాయి.



● టెలివిజన్ ఎపిసోడ్‌లో భగత్‌సింగ్, దుర్గా భాభీ

### స్కాట్ బదులు సాండర్స్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు 17 డిసెంబర్ 1928న లాహోర్‌లో పోలీస్ ఆఫీసర్ స్కాట్‌ను హతమార్చడానికి సిద్ధమయ్యారు. అయితే బైక్ మీద రావాల్సిన స్కాట్ కారులో, కారులోనూ రావాల్సిన మరో అధికారి సాండర్స్ బైక్ మీద రావడంతో అయోమయం నెలకొంది. అయినా సరే ఎదురుపడిన సాండర్స్‌పై మొదట రాజ్‌గురు, ఆ తర్వాత భగత్ సింగ్ తుపాకీ పేల్చి అతణ్ణి హతమార్చారు. లాహోర్ అంతా గగ్గోలు రేగింది. వందలాది మంది పోలీసులు అన్ని దారులు... బస్టాండ్లు... రైల్వేస్టేషన్లు కమ్ముకున్నారు. లాహోర్‌లో ఉండటం భగత్‌సింగ్‌కు ఏ మాత్రం మంచిది కాదు. అతణ్ణి తప్పించేవారు ఎవరు?

### ఆమె వచ్చింది

భగవతి చరణ్ ఓహ్రా సతీమణి దుర్గావతిని అందరూ దుర్గాభాభీ అని పిలిచేవారు. సాండర్స్‌ని హత్య చేశాక భగత్‌సింగ్, రాజ్‌గురు నేరుగా దుర్గావతి దగ్గరకు వచ్చారు. అప్పటికి ఆమె భర్త వేరే పని మీద కలకత్తా వెళ్లి ఉన్నాడు. జరిగింది తెలుసుకున్న దుర్గావతి వెంటనే భగత్‌సింగ్‌ను లాహోర్ దాటించడానికి సిద్ధమైంది. జుట్టు కత్తిరించుకుని హ్యాట్ పెట్టి రూపం మార్చిన భగత్‌సింగ్‌కు ఆమె భార్యగా నటిస్తూ తన మూడేళ్ల కొడుకుతో మరుసటి రోజు సాయంత్రం లాహోర్ నుంచి డెహ్రాడూన్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో మొదటి తరగతి ప్రయాణికురాలిగా బయల్దేరదీసింది. వందలాది నిఘా కళ్ల మీద ఈ పని చేయడం చాలా ప్రమాదం... మూడేళ్ల కొడుక్కు కూడా ఏదైనా కావచ్చు అని భగత్‌సింగ్ ఆమెతో అన్నాడు. 'నా కొడుక్కు మరణం సంభవిస్తే ఒక దేశభక్తునిగా తన ప్రాణం అర్పించే అవకాశం వాడికి దక్కుతుంది' అని చెప్పి ఆమె ముందుకు కదిలింది. భగత్‌సింగ్ ఆధునికవేషంలో ఉన్న అధికారిగా, దుర్గావతి అతని భార్యగా, రాజ్‌గురు నౌకరుగా ఆ ప్రయాణం చేశారు. బ్రిటిష్ వాళ్లకు ఏ మాత్రం అనుమానం రాలేదు. భగత్‌సింగ్‌ను అలా క్షేమంగా కలకత్తా చేర్చి వెనక్కు వచ్చింది దుర్గావతి.

### గొప్ప దేశభక్తురాలు

స్వతంత్ర పోరాటం చేస్తున్న భగవతి చరణ్ ఓహ్రాను వివాహం చేసుకునేనాటికి దుర్గావతికి 13 ఏళ్లు. పెళ్లి తర్వాతనే చదువుకుంది. ఇంట్లో ఇరుగు పొరుగు పిల్లలకు పాఠాలు చెప్పేది. సాయుధ పోరాటం చేయాలన్న భర్త ఆశయానికి మద్దతుగా నిలిచిందామె. భగత్‌సింగ్‌ను తన కన్నబిడ్డలా భావించింది. భగత్ సింగ్ పార్లమెంట్‌లో బాంబు దాడి చేసి అరెస్ట్ అయ్యాక ఆ తర్వాతగాని అతడే సాండర్స్ హత్యలో ఉన్నాడన్న సంగతి పోలీసులకు తెలియలేదు. ఆ కేసు వాదనలను బ్రిటిష్ ప్రభుత్వం హడావిడిగా ముగించి అక్టోబర్ 7, 1930న తీర్పు వెలువరించి భగత్‌సింగ్‌కు మరణశిక్ష విధించింది. అయితే లాహోర్‌లో ఈ విచారణ జరుగుతున్నప్పుడు భగత్‌సింగ్‌ను తీసుకెళ్లే వ్యానుపై బాంబుదాడి చేసి అతణ్ణి కాపాడాలని ప్లాన్ చేసింది దుర్గావతి. వీలు కాలేదు.

### భర్తను కోల్పోయి

భగత్‌సింగ్‌ను జైలు నుంచి రక్షించడానికి స్వదేశీ జ్ఞానంతో బాంబులు తయారు చేస్తూ ప్రమాదవశాత్తు భగవతి చరణ్ ఓహ్రా మరణించాడు. అంత కష్టాన్ని తట్టుకుని దేశం కోసం పోరాడాలనుకుంది దుర్గావతి. భగత్‌సింగ్ మరణశిక్ష విధించాక ఆగ్రహంతో బొంబాయి వెళ్లి బ్రిటిష్ గవర్నర్‌ను చంపాలనుకుంది. అయితే గవర్నర్ దొరకలేదు. మరో బ్రిటిష్ అధికారి మీద స్వయంగా గుళ్ల వర్షం కురిపించి పగ చల్లార్చుకుంది. భగత్ సింగ్ ఉరి (1931 మార్చి 23) తర్వాత తన వాళ్లంటూ ఎవరూ లేకపోవడం, పోలీసుల వెతుకులాట ఎక్కువ కావడంతో తనే వెళ్లి లొంగిపోయింది. మూడేళ్ల జైలు శిక్ష అనంతరం మొదట లక్నో ఆ తర్వాత ఘజియాబాద్‌లో పెద్దగా పబ్లిక్‌లో ఉండటానికి ఇష్టపడక స్కూల్ నడుపుతూ 1999లో తన 92వ ఏట మరణించిందా గొప్ప దేశభక్తురాలు, భారత తొలి సాయుధ పోరాట సమరయోధురాలు దుర్గాభాభీ.

---

# ఇది సైనికుల సంగ్రామం

- ఇంటికొకరుగా ఆర్మీ జవాన్లు
- నాటి పీపుల్స్‌వార్ ఖిల్లా నుంచి నేడు దేశరక్షణకు సరిహద్దుల్లో యువకులు

**ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలా ఈ ఊరికి ఉన్న ప్రత్యేకత 'దేశభక్తి'. దేశాన్ని కాపాడాలనే ధ్యేయంతో ఊరి యువకులు సైన్యం బాట పట్టారు. ఒకే ఊరి నుంచి ఇంటికి ఒక్కరు చొప్పున సుమారుగా 92 మందికిపైగా యువకులు సైన్యంలో తమ సేవలను అందిస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఖిల్లాగా ఉన్న ఆ ఊరిని ఇప్పుడు ఆర్మీ జవాన్ల పుట్టినిల్లుగా పిల్చుకుంటున్నారు. ఆ ఊరు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం. ఆ ఊరి ముచ్చట్లలోకి వెళదామా?**

సుమారు 40 ఏళ్ల క్రితం కట్కూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల డేనియల్ మిలిటరీలో జవాన్‌గా చేరాడు. ఆయన స్ఫూర్తితో గ్రామంలోని యువకులు సైన్యం బాటపట్టారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆర్మీలో చేరారు. జవాన్ స్థాయి నుంచి లాన్స్‌నాయక్, నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇలా గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం 92 మంది ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దాంతో జిల్లాలో కట్కూరు గ్రామం అంటే ఆర్మీజవాన్‌ల గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 1,014 కుటుంబాలుండగా జనాభా సుమారుగా 3,045 ఉన్నారు. అందులో మొత్తం గ్రామంలో 175 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వీరిలో కొందరు ఇతర ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు.

**- మాలోతు శ్రీనివాస్**, సాక్షి, అక్కన్నపేట

### దేశసేవ ఇష్టం...



దేశసేవ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే 1998లో భారతసైన్యంలో చేరాను. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ బెంగళూర్‌లో ట్రైనింగ్ చేశాను. కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నాను. కాశ్మీర్‌లో రాష్ట్రీయ విభాగంలో సేవలు అందించి అనేక టెర్రరిస్ట్ ఆపరేషన్‌లలో పాల్గొన్నాను. కాశ్మీర్ సేవలను గుర్తించి నాకు సుబేదార్ మేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

**- పంజా సదయ్య**, సుబేదార్

### గర్వపడుతున్నా...



దేశరక్షణ కోసం సైన్యంలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా దేశం కోసం పని చేయడం ఆనందంగా ఉంది.

**- కొయ్యడ శ్రీనివాస్**, ఆర్మీ జవాన్

---

పోస్టల్ స్టాంపులు

# యుద్ధం ముద్రలు

**మహిళలు ఇల్లు విడిచి బయట అడుగు పెడితే వింతగా చూసే కాలంలో సాహసమే వెన్నెముకగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు ఎంతోమంది మహిళలు. వారి త్యాగాల వెలుగు చరిత్రకే పరిమితమైనది కాదు, వర్తమానంలోనూ స్ఫూర్తిని ఇస్తుంటుంది. ఎంతోమంది మహిళా స్వాతంత్ర్య సమరయోధుల పోస్టల్ స్టాంప్స్ విడుదల అయ్యాయి. ఈ చిన్న స్టాంప్‌లు వారి త్యాగాలు, పోరాట పటిమను ప్రతిఫలిస్తాయి. పోస్టల్ స్టాంప్స్‌పై మెరిసిన కొందరు మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గురించి...**

### రుక్మిణీ లక్ష్మీపతి



ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని మధురైలో పుట్టింది రుక్మిణీ. గాంధీజీ 'హరిజన సంక్షేమ నిధి' కోసం తన బంగారు నగలన్నీ విరాళంగా ఇచ్చేసింది. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో చురుగ్గా పాల్గొంది. ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టయి జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళగా చరిత్రలో నిలిచింది.

### సుభద్రా జోషి



గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితం అయిన సుభద్రా జోషి విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొంది. 'హమారా సంగ్రామ్' పత్రికకు ఎడిటర్‌గా పని చేసింది. సుభద్రను అరెస్ట్ చేసి లాహోర్ సెంట్రల్ జైల్‌కు తరలించారు. విడుదలయ్యాక మళ్లీ ఉద్యమంలో భాగం అయింది. సుభద్ర అంకితభావాన్ని నెహ్రూ ప్రశంసించారు.

### రాణి మా గైడిన్లియు



బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన 'హెరాక' ఉద్యమంలో పదమూడు సంవత్సరాల వయసులోనే పాల్గొంది రాణి మా. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి మహిళగా చరిత్రకెక్కింది. 'హెరాక' ఉద్యమంతో పాటు ఎదుగుతూ వచ్చిన రాణి మా ప్రముఖ రాజకీయ నాయకురాలిగా, ఆధ్యాత్మిక గురువుగా ప్రఖ్యాతి పొందింది.

### బేగం హజ్రత్ మహల్



తొలి తరం మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు బేగం హజ్రత్ మహల్. బేగం హజ్రత్ ఇతర సంస్థానాధీశులతో కలిసి బ్రిటిష్ వారితో యుద్ధం చేసింది. లక్నో సమీపంలో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారిని ఓడించింది. ఆ తరువాత కాలంలో మాత్రం ఓటమికి గురైంది. బ్రిటిష్ వారికి చిక్కకుండా అడవుల్లో తల దాచుకొని పోరాడేది.

### కమలానెహ్రూ



జవహర్‌లాల్ నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ మహిళా సాధికారత కోసం గళం విప్పిన యోధురాలు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అరెస్టై జైలుకు వెళ్లింది. 'దేశ సేవిక' సంఘాలను ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగం అయ్యేలా చేసింది.

### సుభద్రాకుమారి చౌహాన్



సుభద్రాకుమారి చౌహాన్ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన తరువాత నాగపూర్ నుంచి అరెస్ట్ అయిన మొట్టమొదటి మహిళా సత్యాగ్రహిగా చరిత్రలో నిలిచింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా పోరాడింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఎన్నో త్యాగాలు చేసింది.

### అరుణా అసఫ్ అలి



భర్త అసఫ్ అలీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది అరుణ. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయింది. కాంగ్రెస్‌పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసిన తరువాత బ్రిటిష్ వారు విరుచుకుపడ్డారు. ప్రముఖ నాయకులను అరెస్ట్ చేశారు. ఆ క్లిష్ట సమయంలో అరుణా అసఫ్ అలి కార్యకర్తలకు అండగా ఉంది. బొంబాయి గొవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ జెండాను ఎగరేసి క్విట్ ఇండియా ఉద్యమం ఊపందుకునేలా చేసింది.

### దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాహసవంతురాలైన సామాజిక కార్యకర్త, చిన్నతనం నుంచే మహిళల హక్కుల కోసం పోరాడింది. మహాత్మా గాంధీ నుంచి స్ఫూర్తి పొంది స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. గాంధీజీ ప్రభావంతో దుర్గాబాయి మాత్రమే కాదు ఆమె కుటుంబం మొత్తం అన్ని రకాల పాశ్చాత్య దుస్తులను విడిచిపెట్టి, ఖాదీని మాత్రమే ధరించేవారు. మద్రాస్‌లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించింది.

### రాజ్‌కుమారీ అమృత్ కౌర్



రాజ్‌కుమారీ అమృత్ కౌర్ సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు. గాంధీజీ కార్యదర్శిగా పని చేసిన ఆమె దండి మార్చ్‌లాంటి ఎన్నో జాతీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంది. క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రాజ్‌కుమారి ఇరవై నెలల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. రాచరిక కుటుంబంలో పుట్టినప్పటికీ మహాత్ముడి ఆశ్రమంలో సాధారణ జీవితాన్ని గడిపింది.

---

అరుదైన ఆహ్వానం

# 12 ఏళ్లు... 15 లైబ్రరీలు

**ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ఇరవై మందిలో విద్యార్థులు ఆరుగురు. వారిలో అమ్మాయి ఒకే ఒక్కరు. ఆ సరస్వతి పుత్రిక పేరు ఆకర్షణ. లైబ్రరీలు స్థాపిస్తూ సాహిత్యాన్ని సామాన్యులకు దగ్గర చేస్తున్న ఆమె అక్షరసేవకు జాతీయ స్థాయిలో అందిన గుర్తింపు ఇది.**



● సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతితో...

''హైదరాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్‌మాస్టర్ నుంచి 12వ తేదీన నాన్నకు ఫోన్ వచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 15వ తేదీన ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కావలసిందిగా మీ అమ్మాయి ఆకర్షణకు ఆహ్వానం వచ్చిందని చెబుతూ అభినందనలు తెలియచేశారు'' అంటూ తాను లైబ్రరీ వ్యవస్థాపకురాలిగా మారిన వివరాలను సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు ఆకర్షణ సతీష్.

### కోవిడ్ వచ్చినప్పుడు

''హైదరాబాద్‌లో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాన్న సతీశ్ క్యాన్సర్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ ఉద్యోగి. నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాను. పుస్తక పఠనం నా హాబీ కావడంతో వెయ్యికి పైగా పుస్తకాలతో ఇంట్లోనే నాకు సొంత లైబ్రరీ ఉంది. ఇతరుల కోసం లైబ్రరీ స్థాపించాలనే ఆలోచన కోవిడ్ సమయంలో వచ్చింది.

### తొలి లైబ్రరీ క్యాన్సర్ హాస్పిటల్‌లో

నాన్న ఉద్యోగరీత్యా క్యాన్సర్ హాస్పిటళ్లకు టచ్‌లో ఉంటారు. కోవిడ్ సమయంలో ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వాళ్లు 'కోవిడ్ కారణంగా వంటవాళ్లు డ్యూటీకి రావడం లేదు. పేషెంట్‌లకు ఆహారం అందించడానికి ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేసి పెట్టవలసింది'గా కోరడంతో నాన్న వాళ్ల కోసం రోజూ భోజనం వండించి తీసుకెళ్లి ఇచ్చేవారు. నాకు స్కూల్ లేకపోవడంతో రోజూ నాన్నతోపాటు హాస్పిటల్‌కి వెళ్లేదాన్ని. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న పేషెంట్‌లలో నా ఏజ్ గ్రూప్ వాళ్లతో స్నేహం ఏర్పడింది. వాళ్లు కొంతమంది చదువుకోవడానికి పుస్తకాలు తెచ్చిపెట్టమని అడిగారు. రోజూ నా పుస్తకాలు కొన్ని తీసుకెళ్లి ఇస్తూ ఉన్నప్పుడు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయలత గారు... 'హాస్పిటల్‌కి చికిత్స కోసం ఎప్పుడూ కొత్తవాళ్లు వస్తుంటారు. హాస్పిటల్‌లోనే లైబ్రరీ ఉంటే బావుంటుంది' అన్నారు. వారి ఆలోచనే నా లైబ్రరీ ఉద్యమానికి నాంది. నా పుస్తకాలతోపాటు మా స్కూల్, అపార్ట్‌మెంట్ స్నేహితుల నుంచి సేకరించిన వెయ్యికి పైగా పుస్తకాలతో తొలి లైబ్రరీ అలా మొదలైంది. ఇప్పటికి 9,836 పుస్తకాలతో 15 లైబ్రరీలు ఏర్పాటు చేయగలిగాను.

### పదకొండు వేల పుస్తకాలు

నాలుగేళ్లలో పదకొండు వేల పుస్తకాలు సేకరించాను. అందులో రెండు వేల పుస్తకాలు ప్రధాని నరేంద్రమోదీగారిచ్చారు. ఈ ఏడాది మార్చి 18న కోయంబత్తూరులో ఆయనను కలిసే అవకాశం వచ్చింది. ఆ సందర్భంగా ఆయన 25 లైబ్రరీలు స్థాపించమని, 25 లైబ్రరీ స్థాపనకు స్వయంగా హాజరవుతానని చెప్పారు. భారత రాష్ట్రపతి గత ఏడాది శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కి వచ్చినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కలిశాను. అప్పుడామె 'ప్రజల్లో రీడింగ్ హ్యాబిట్ తగ్గుతోంది, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి దోహదం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కొనసాగించ'మని చెప్పి ఆమే స్వయంగా 74 పుస్తకాలిచ్చారు. ఈ ఏడాది ఢిల్లీ, కర్తవ్య పథ్‌లో జరిగిన 75వ రిపబ్లిక్ డే ఉత్సవాలకు ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యాను. ఇదే ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలకు కూడా హాజరయ్యే అవకాశం కలగడం సంతోషంగా ఉంది'' అంటూ 25 లైబ్రరీల లక్ష్యాన్ని పూర్తి చేస్తానని చెప్పింది ఆకర్షణ సతీశ్.

**- వాకా మంజులారెడ్డి**, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

---

మన(సు)లో మాట

# మా బాబు ఒకచోట కుదురుగా ఉండటం లేదు...



**మా బాబు వయసు 5 సంవత్సరాలు. ఒకచోట నిలకడగా ఉండకుండా, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంట్లో, స్కూల్లో బయటా కూడా ఇలాగే చస్తుంటాడు. బయట ఫంక్షన్లకు తీసుకెళితే తనను పట్టుకోవడం, తన చుట్టూ తిరగడంతోటే సరిపోతుంది. అందువల్ల ఈ మధ్య బయటకు వెళ్లడం కూడా తగ్గించేశాం. వాళ్ల నానమ్మేమో, ఇది పిల్లల్లో మామూలే అంటుంది. ఈ మధ్య వాళ్ల స్కూల్ టీచర్ మమ్మల్ని పిలిచి, మా బాబు మీద అనేక కంప్లయింట్లు చెప్పింది. మాకు చాలా ఆందోళనగా ఉంది.**

**- కె. మాధవి,**
**సికింద్రాబాద్**

పిల్లల మెదడులో ఉండే సెల్ఫ్ కంట్రోల్ విభాగం లోని లోపాల వల్ల, వారసత్వ లక్షణాల రీత్యా, కొందరు పిల్లలకు మీరు చెప్పిన లక్షణాలు రావచ్చు. దీనిని హైపర్ యాక్టివిటీ లేదా ఏడీహెచ్‌డీ అంటారు. నిలకడ లేకపోవడం, చదువు మీద ఏకాగ్రత లేకపోవడం, వస్తువులు విసిరేయడం, సహనం లేకపోవడం, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉండటం, స్కూల్‌లో వస్తువులు మరచిపోవడం, ఈ సమస్య ముఖ్య లక్షణాలు. వీరికి తెలివితేటలు బాగానే ఉన్నప్పటికీ, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనకబడతారు. ఇలాంటి వారిని ఎంత చిన్నవయసులో గుర్తించి, సరియైన చికిత్స చేయిస్తే అంత తొందరగా దీంట్లోంచి బయట పడతారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, అవసరమైతే కొద్ది మోతాదులో కొన్ని మందులు వాడటం ద్వారా వీరిని పూర్తిగా బాగు చెయ్యచ్చు. పేరెంట్స్, టీచర్లు ఇలాంటి వారిని త్వరగా గుర్తించగలిగితే తొందరగా బాగుపడతారు. మైకేల్ ఫిలిప్స్ అనే స్విమ్మర్ ఈ సమస్యతో బాధపడుతూ చికిత్స తీసుకుని బాగుపడి, ఒలింపిక్స్‌లో 20కి పైగా స్వర్ణ పతకాలు సాధించాడు. చైల్డ్ సైకియాట్రిస్ట్‌ల సూచనలు తీసుకోవడం, పాటించడం మేలు చేస్తుంది.




**- డా. ఇండ్ల విశాల్ రెడ్డి**
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

---

హెల్దీ డైట్

## సగ్గుబియ్యం పొంగనాలు



**కావలసినవి:** సగ్గుబియ్యం – అర కప్పు (గంట సేపు నానబెట్టాలి); పనీర్ తురుము – 75 గ్రాములు; వేరుశనగపప్పుల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; క్యారట్ తురుము – 3 టేబుల్ స్పూన్‌లు ; బంగాళదుంప – 1 (ఉడికించి తొక్క తీసి చిదమాలి); జీలకర్ర పొడి– టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; క్యాబేజ్ తరుగు – ముప్పావు కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు (రెడ్, గ్రీన్ క్యాప్సికమ్); చీజ్ తురుము – 50 గ్రాములు (12 భాగాలు చేసుకోవాలి); నూనె – టీ స్పూన్.

**తయారీ:** ● ఒక పాత్రలో క్యాబేజ్ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఇందులో నూనె, చీజ్ మినహా మిగిలినవన్నీ వేసి బాగా కలిపి పన్నెండు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో చీజ్ స్టఫ్ చేస్తూ గోళీలాగా చేయాలి ● గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో ఒక్కో చుక్క నూనె రుద్ది పొంగనాన్ని పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు కాల్చాలి.

**పోషకాలు: (ఒక్కో పొంగనంలో)...**
● కేలరీలు 63; ● ప్రొటీన్ – 2.5 – 3 గ్రాములు; ● కార్బోహైడ్రేట్లు – 8–9 గ్రాములు; ● ఫ్యాట్ – 2–3 గ్రాములు; ● ఫైబర్– గ్రాము; క్యాల్షియం – 40 –50 గ్రాములు.



**డాక్టర్ కరుణ**
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్